మజ్జివలసలో పారిశుధ్య పనులు

చెత్తను తగలబెడుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని బూర్జ పంచాయతీ మజ్జివలస గ్రామంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యాక్రమంలో భాగంగా ఉపాధ్యక్షులు మజ్జి కృష్ణంరాజు, గ్రామస్తులు పరిశుభ్రతా పనులు చేపట్టారు. వీధుల్లో చెత్తాచెదారం పోగేసి తగులబెట్టారు, తడిపొడి చెత్తసేకరణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి నిల్వ లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో విఆర్‌పి మజ్జి సురేష్ కుమార్, పీసా కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ సారథి విజయగౌరి

ఉపాధ్యాయ సమస్యలపై ఉద్యమంలో విజయగౌరి (ఫైల్‌ఫొటో)

- పిడిఎఫ్ తరుపున పోటీ
- ఎమ్మెల్సీ బరిలో ఉన్న పది మందిలో ఒక్కరే మహిళ
- సర్వత్రా సానుకూలత
- తమది ఆడపడుచుల పార్టీ అంటూనే ఆమెను నిలువరించే ఎత్తుల్లో 'కూటమి'

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

శాసన మండలికి జరిగే ఎన్నికలు అత్యంత ప్రత్యేకమైనవి. ఈ నెల 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానానికి జరిగే ఎన్నికల్లో 10 మంది అభ్యర్థులు బరిలో ఉండగా వారిలో యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఉద్యమ సారథి అనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఆమె పోరాట పథం సుదీర్ఘమైనది. అందుకే ఆమెను గెలిపించుకునే దిశగా గురువులు అడుగులు వేస్తున్నారు.

ఈ ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి మద్దతుతో ఎపిటిఎఫ్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, పిడిఎఫ్ నుంచి కోరెడ్ల విజయగౌరి, పిఆర్‌టియు బలపరిచిన మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు ప్రధాన పోటీదారులుగా ఉన్నారు. పాకలపాటి, గాదె పనితీరు గురించి ఉత్తరాంధ్రకు చెందిన టీచర్లందరిలోనూ ఒక అంచనా లేకపోలేదు. వారు ఈ ప్రాంత వాణిని, ఉపాధ్యాయుల సమస్యలను మండలిలో ఏనాడూ లేవనెత్తలేదు.

ఉద్యమ వారసత్వం పిడిఎఫ్ సొంతం

గతంలో పిడిఎఫ్ అభ్యర్థులుగా గెలిచిన చుక్కా రామయ్య, విఠపు బాలసుబ్రమణ్యం, కెఎస్.లక్ష్మణరావు, ఐవి, ఎంవిఎస్.శర్మ తదితరుల పోరాట వారసత్వాన్ని విజయగౌరి గెలిస్తే ముందుకు తీసుకెళ్లనున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, విభజిత ఎపిలోనూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలంతా ప్రజా సమస్యలు, మహిళా సమస్యలు, ఉపాధ్యాయ, పట్టభద్రుల సమస్యలపై మండలిలో గళమెత్తినవారే. ఆ మేధావుల మద్దతు విజయగౌరికి ఉంది. ప్రత్యేకించి ఉత్తరాంధ్ర జిల్లాల్లో మహిళా టీచర్లలో విజయగౌరి అభ్యర్థిత్వం పట్ల మంచి సానుకూలత వ్యక్తమవుతోంది. ప్రచారం సందర్భంగా తమ కోసం పోరాడే ఒక ఉద్యమ నేత, తమకు తెలిసిన వ్యక్తే పిడిఎఫ్ అభ్యర్థిగా ఉన్నారన్న ఆశాభావాన్ని పెక్కు మంది వ్యక్తం చేస్తున్నారు. గతంలో శాసన మండలిలో కల్పలతా రెడ్డి మహిళా ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా రాష్ట్రంలో గెలిచి అడుగుపెట్టినా ఆమె ఏ సమస్యపైనా మాట్లాడిన దాఖలా లేదు. ఉత్తరాంధ్ర నుంచి మండలికి పిడిఎఫ్ తరపున బరిలోకి దిగిన కోరెడ్ల విజయగౌరి గత 20 ఏళ్లకుపైగా విద్యా రంగ పరిరక్షణ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తూ పలు స్కూళ్లలో ఉపాధ్యాయరాలిగా విధులను నిర్వర్తిస్తూ మంచి ఉపాధ్యాయినిగా పేరు తెచ్చుకున్నారు. టీచర్ల సమస్యలపై రాష్ట్ర స్థాయిలో గళమెత్తి ఉద్యమాల్లో అగ్రపీఠిన నిలిచిన చరిత్ర ఆమెది. అందుకే ఈసారి ఆమెను గెలిపించుకోవాలన్న కాంక్ష మహిళా ఉపాధ్యాయుల్లో కనిపిస్తోంది.

పెద్దల సభకు మేధావులు.. ప్రశ్నించేవారే..

పెద్దల సభగా పేరుగాంచిన శాసన మండలికి సమస్యలపై అవగాహన ఉండి, పోరాటాల్లో అనుభవంగలవారు, ప్రశ్నించేవారు, ప్రభుత్వాలకు మంచి సలహాలు అందించే వారినే ఎన్నుకోవాలి. ఉత్తరాంధ్ర అంతటా సుమారు 80 లక్షలకు పైగా జనాభా ఉంటే ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లుగా ఉండే 22493 మంది మాత్రమే తాజా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు. కాబట్టి విజ్ఞులైన ఉపాధ్యాయులు, వీరిలోగల సాహితీ వేత్తలు, కవులు, రచయితలు, మేధావులు అంతా పెద్దల సభ 'శాసన మండలి' విషయంలో ఆచితూచి అడుగు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఒక్క మహిళను ఓడించేందుకు కూటమి పాట్లు

ఆడపడుచుల కోసం తమ పార్టీ పుట్టిందని చెప్పుకునే తెలుగుదేశం పిడిఎఫ్ నుంచి కోరెడ్ల విజయగౌరి అభ్యర్థిత్వాన్ని సహించలేక పోతుండడం గమనార్హం. అధికార తెలుగుదేశం, జనసేన ఒకవైపు, బిజెపి మరోవైపు ఆమెను ఓడించేందుకు ఎత్తులు వేస్తున్నాయి. టిడిపి రాష్ట్ర నాయకత్వం ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఆ పార్టీ కార్యాలయాల్లో గడిచిన వారం రోజులుగా సమీక్షలు జరుపుతూ మంత్రులు, ఎంఎల్‌ఎలు, మండల, జిల్లా నాయకత్వాలను బరిలోకి దింపేసి ఓట్ల కోసం ఉపాధ్యాయుల ముంగిటకొచ్చి విన్యాసాలు ప్రదర్శిస్తున్నాయి. ప్రలోభాలు, బెదిరింపులకూ రానున్న కాలంలో కూటమి దిగనుంది. అదే సమయంలో అవగాహన, అనుభవం కలిగిన టీచర్లంతా వీటిని పసిగట్టి తిప్పికొట్టేందుకు సిద్ధమౌతున్నారు.

చట్రాపల్లి బాధితులు గాలికి..

కొండ చరియలు విరిగి పడి ధ్వంసమైన ఇళ్లు (ఫైల్‌ఫొటో)

- ★ కొండచరియలు విరిగిపడి ధ్వంసమైన గ్రామం
- ★ మోడల్ కాలనీ నిర్మిస్తామని నాడు అధికారుల హామీ
- ★ ఆరు నెలలు కావస్తున్నా నేటికీ మంజూరు చేయని వైనం
- ★ నిలువనీడ లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్న గిరిజనులు
- ★ గత్యంతరం లేక సొంతంగా తాత్కాలిక ఇళ్ల నిర్మాణానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-సీలేరు

అర్ధరాత్రి వర్ష బీభత్సానికి కొండచరియలు విరిగిపడి గ్రామం మొత్తం ధ్వంసమైన జికె.వీధి మండలం చట్రాపల్లి బాధితులను ప్రభుత్వ పెద్దలు, జిల్లా అధికారులు గాలికొదిలేశారు. మోడల్ కాలనీ నిర్మించి ఇస్తామని నాడు జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ నేటికీ నెరవేర్చలేదు. ఆరు నెలలుగా నిలువనీడ లేక ఇబ్బంది పడుతున్న బాధిత గిరిజనులు గత్యంతరం లేక సొంత డబ్బులతో తాత్కాలిక ఇళ్ల నిర్మాణానికి ఉపక్రమించారు.

గతేడాది సెప్టెంబర్ 8వ తేదీన రాత్రి భారీ వర్షాలు, వరద బీభత్సానికి జీకే.వీధి మండలం గాలికొండ పంచాయితీ పరిధి చట్రాపల్లి గ్రామానికి ఎదురుగా ఉన్న కొండపై నుంచి కొండ చరియలు, పెద్ద పెద్ద వృక్షాలు విరిగిపడి ఆ గ్రామంపైకి కొట్టుకొచ్చాయి. అర్ధరాత్రి సమయంలో ఇళ్లు కొట్టుకుపోవడంతో ఒకరు మృత్యువాత పడగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంగతి తెలిసిందే. ఈ సంఘటనలో ఐదు ఇళ్లు పూర్తిగా కొట్టుకుపోగా, మరో ఎనిమిది ఇళ్లు దెబ్బతిన్నాయి. వీరికి చెందిన మేకలు, కోళ్లు, పశువులు, పంట పొలాలు కొట్టుకుపోవడంతో తీవ్ర నష్టం చోటుచేసుకుంది.

నెరవేరని జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ హామీలు

అప్పట్లో అల్లూరి జిల్లా కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీవో, ఇతర అధికారులు గ్రామాన్ని సందర్శించి జరిగిన నష్టం తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం నుంచి కొంతమేరకు ఆర్థికంగా సహాయం అందించి చేతులు దులుపుకున్నారు. బాధితులకు సురక్షిత ప్రదేశంలో మోడల్ కాలనీ నిర్మాణం చేసి ఇల్లు ఇస్తామని నాడు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఏ పిఓ హామీ ఇచ్చారు. కాని అధికారులు ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు.

సొంతంగా ఇల్లు నిర్మించుకునేందుకు స్థలాన్ని చదును చేసిన దృశ్యం

సొంతంగా తాత్కాలిక ఇళ్ల నిర్మాణానికి ఏర్పాట్లు

ప్రభుత్వం పక్కా ఇళ్లు కట్టి ఇస్తుందని చట్రాపల్లి గ్రామ గిరిజనులు ఎదురుచూపులు చూశారు. ఇప్పటికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయకపోవడంతో ఉండటానికి నిలువనీడ లేక బాధిత గిరిజనులే సొంత డబ్బులతో తాత్కాలిక ఇళ్ల నిర్మాణానికి ఉపక్రమించారు. గతంలో కొండచరియలు విరిగి పడి గ్రామంపైకి కొట్టుకొచ్చిన మార్గాన్ని విడిచిపెట్టి దానికి అటు, ఇటు రెండు వైపులా ఉన్న ప్రదేశాన్ని జెసిబితో చదును చేసి ఏడు కుటుంబాల వారు నివాస గృహాలు ఏర్పాటు చేయడానికి సిద్ధం చేశారు. గ్రామంలో 30కి పైగా కుటుంబాలు ఉండగా, వారు కూడా సురక్షిత ప్రాంతంలో ఇళ్ల నిర్మాణానికి సిద్ధమవుతున్నట్లు చెబుతున్నారు.

మోడల్ కాలనీ నిర్మాణం చేయాలి

ఈ సందర్భంగా గ్రామస్తులు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉండడానికి గూడు లేకపోవడంతో ఎండ, వాన, మంచు, చలికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇస్తుందని ఇప్పటి వరకు ఎదురు చూశామని, నేటికీ మంజూరు చేయకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో తామే తాత్కాలిక ఇల్లు నిర్మించుకుంటున్నామని చెప్పారు. సెప్టెంబర్ 8న వరద బీభత్సానికి గ్రామంపైకి కొట్టుకొచ్చిన మట్టి దిబ్బలు ఇప్పటికీ తొలగించే చర్యలు అధికారులు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి దృశ్యాలు నేటికీ కళ్ళకు కట్టినట్టే కనిపిస్తున్నాయని, అవి తలచుకుంటే రాత్రి సమయంలో నిద్ర పట్టడం లేదని వాపోయారు. అధికారులకు గిరిజనులు బాధలు పట్టవా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి మోడల్ కాలనీ మంజూరు చేసి గ్రామస్తులందరికీ పక్క ఇల్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కలుషిత ఊటగెడ్డ నీరే గతి

- ★ మరమ్మతుకు గురైన నీటి పథకం మోటారు
- ★ ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని యంత్రాంగం
- ★ వల్లిపనసలో నీటికష్టాలపై నేతలు,అధికారుల నిర్లక్ష్యం
- ★ చందాలు వేసుకుని స్వచ్ఛందంగా మరమ్మతులు

ఊటకుంటలోని బురదనీటిని సేకరిస్తున్న గిరి మహిళలు

పాడైన బోరు మోటారుకు మరమ్మతులు

వృథాగా ఉన్న నీటి ట్యాంకు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: మండలంలోని ఇరగాయి పంచాయతీ మారుమూల వల్లిపనస గ్రామానికి చెందిన ఆదిమజాతి గిరిజనులు (పీవీటీజీ) గుక్కెడు తాగునీటికి నానా అగచాట్లు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ జల్ జీవన్‌మిషన్ పథకం ద్వారా ఇంటింటికి రక్షిత తాగునీటి అందించినా, దీనికి సంబంధించిన బోరు మోటార్ నెల రోజులకే మరమ్మతుకు గురికావడంతో వాటర్ ట్యాంకు దిష్టిబొమ్మలా మిగిలిపోయింది. ప్రజలకు నీటికష్టాలు మొదలయ్యాయి. దీనిపై అధికారులకు అనేకమార్లు చెప్పినా పట్టించుకోకపోవడం గ్రామానికి కిలోమీటర్ల దూరంలో వున్న ఊటగెడ్డ నుంచి కలుషిత బురద నీటిని తెచ్చుకుని నీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. మరో గత్యంతరం లేని పరిస్థితుల్లో బురద నీటినే తాగడం వల్ల వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వల్లిపనస గ్రామంలో 36 కుటుంబాలకు చెందిన 219 మంది ఆదిమజాతి గిరిజనులు నివాసముంటున్నారు. వీరి కోసం ప్రభుత్వం రక్షితనీటి పథకాన్ని ఏర్పాటు చేసినా అది మరమ్మతులకు గురైనప్పుడు పట్టించుకునే దిక్కులేకపోవడంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. దీంతో .తాగునీటి కోసం పొలాలు, వాగులు దాటుకుని వెళ్లి ఊటకుంటల్లోని నీటిని తెచ్చుకుంటున్నామని అంటున్నారు. ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో ఊటకుంటలోని నీరు సైతం ఇంకిపోయి బురదమయంగా మారిందని, అయినా గత్యంతరం లేక అవే నీటిని తెచ్చుకుని, వాడుకుంటున్నామని అంటున్నారు. తాము పివిటిజి గిరిజనులు కావడంతో తమ సమస్యలపై అందరూ నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. మోటారు బాగుచేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక సర్పంచ్, పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారెవరూ పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

చందాలు వేసుకుని పాడైన మోటారుకు మరమ్మతులు

ఎండలు మండుతుండడం, వేసవి సమీపించడంతో నానాటికీ తీవ్రమౌతున్న తాగునీటి కష్టాలపై అధికారులుగానీ, పంచాయతీ గానీ పట్టించుకోని పరిస్థితుల్లో గ్రామంలోని పివిటిటి గిరిజనులంతా తలో కొంత విరాళం పోగేసుకుని జల్‌జీవన్‌మిషన్ పథకపు మోటర్ మరమ్మతులుకు పూనుకున్నారు. తమ గ్రామం నీటికష్టాలపై అధికారుల నిర్లక్ష్యానికి గ్రామస్తులు మండిపడుతున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు బురిడి రాజు గ్రామపెద్ద బురిడి నరసింగరావు, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు బురిడి విజయ్ కుమార్, గెమ్మెలి సుబ్బారావు, వార్డ్ సభ్యుడు బురిడి సుందరి, అంగన్వాడి టీచర్ బురిడి సీతమ్మ, బురిడి లింగమ్మ,ఉన్నారు.

పోలవరం నిర్వాసితుల గోడు పట్టని ప్రభుత్వం

- నిర్వాసిత కాలనీల్లో సౌకర్యాలు కల్పించిన తరువాతే తరలించాలి
- సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్, చిత్రంలో మంతెన సీతారాం తదితరులు

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం నిర్వాసితుల గోడు రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మండిపడ్డారు. మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో పార్టీ నాయకులు కారం సుందరయ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన గిరిజనుల, ఇతర నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తుందన్నారు. ఎంతసేపు డ్యామ్ కట్టడం గురించే మాట్లాడుతున్నారు తప్ప నిర్వాసితులుగా మారిన ప్రజల గురించి, వారి ఇవ్వవలసిన పరిహారం గురించి మాట్లాడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాసితులను గోదావరిలో ముంచుతారా? అని ప్రశ్నించారు. నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని, గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరికీ నష్టపరహారం చెల్లించి ఉపాధి చూపించాలని డిమాండ్ చేశారు. నిర్వాసిత కాలనీల్లో వసతులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిర్వాసిత కాలనీలు సౌకర్యాలు కల్పించకుండా ముందుగానే తరలించాలని ప్రభుత్వం చూస్తుందని, అన్ని వసతులు కల్పించిన తర్వాత ఇక్కడ నుంచి తరలించాలని కోరారు. భూమికి భూమి చూపించాలని, భూమి సాగు చేసుకునే విధంగా ఉండాలని అప్పుడే ఇక్కడి నుంచి తరలించాలని స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికలు సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలైనా ఇంతవరకు ఏ పథకం కూడా అమలు చేయలేదని, తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, నాయకులు పొడియం శ్రీరామ్మూర్తి, వడ్లాది రమేష్, కుంజ నాగిరెడ్డి, తాతబాబు రెడ్డి, గుండుపూడి లక్ష్మణరావు, కమ్మచిచ్చు సత్యనారాయణ, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

రూ.6.60 కోట్లతో 11 మల్టీపర్పస్ కేంద్రాలు

'ప్రజాశక్తి'తో గిరిజన సంక్షేమ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డేవిడ్ రాజ్



ప్రజాశక్తి-పాడేరు: ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద గిరిజన ప్రాంత అభివృద్ధిలో భాగంగా రూ.6.60కోట్లతో 11 మల్టీపర్పస్ కేంద్రాలకు భవనాలు మంజూరైనట్లు గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ, పాడేరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డేవిడ్ రాజ్ తెలిపార. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల భవనాలు, రహదారుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. 'ప్రజాశక్తి'తో ముఖాముఖిలో ఇఇ డేవిడ్‌రాజ్ వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే...

ప్రశ్న : గిరిజన ప్రగతికి చేపట్టిన పనులేవి?

జవాబు : ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో భాగంగా ఒక్కొక్కటీ రూ.ఆరు లక్షల వ్యయంతో 11 మల్టీపర్పస్ కేంద్రాల భవన నిర్మాణ పనులు ప్రారంభించాం. అంగన్వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలను ఈ భవనాల్లో నిర్వహిస్తారు.

ప్రశ్న : పాఠశాలల్లో చేస్తున్న అభివద్ధి పనులు ఏమిటి?

జవాబు : ఆర్టికల్ 275 ద్వారా నాలుగు పాఠశాలల్లో భవనాలు, సౌకర్యాల కల్పనకు రూ.3.20కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. తాండవ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో డార్మెటరీ, భోజనగది, తరగతి గదులు, మరుగుదొడ్లు, స్నానపు గదుల పనులు చేపడుతున్నాం. క్లాస్ రూమ్స్ డైనింగ్ హాల్ స్నానపు గదులు తదితర పనులు చేపడుతున్నాం. కొయ్యూరు మండలం పాలమామిడిలో రూ.24 లక్షలతో మండల పరిషత్ పాఠశాల భవనాల నిర్మాణం జరుగుతోంది

ప్రశ్న: శాఖాపరంగా ఏయే పనులు జరుగుతున్నాయి?

జవాబు : కొయ్యూరు మండలం పాలమామిడిలో తాగునీటి కల్పనకు రూ.15 లక్షలతో గ్రావిటీ పథకం నిర్మిస్తున్నాం. పాడేరు, జి.మాడుగుల మండలాల్లోని ఈదులపాలెం, వసమామిడి గ్రామాల్లో ఒక్కొక్కటి రూ.55 లక్షల వ్యయంతో ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులు నిర్వహిస్తున్నాం. నీతి అయోగ్ ద్వారా ఒక్కొక్కటీ రూ.12లక్షలు చొప్పున రూ.60లక్షలతో ఐదు అంగన్వాడీ భవన నిర్మాణాలు జరుగుతున్నాయి.

ప్రశ్న : రోడ్డు నిర్మాణ పనులెమైనా చేస్తున్నారా?

జవాబు : జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలానికి ఒక రోడ్డు మంజూరైంది. వీటికి అటవీ క్లియరెన్స్ కూడా లభించింది. 26 గ్రామాలకు రవాణా సౌకర్యం కలిగే రూ.25.50కోట్లతో28 కిలోమీటర్ల తారురోడ్ల నిర్మాణం చేపట్టనున్నాం. వీటికి పంచాయితీ గ్రామసభ తీర్మానం చేసి, అనుమతి లభించిన వెంటనే టెండర్ల ద్వారా రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే చేపడతాం.కొయ్యూరు మండలం పాలమామిడి నుంచి బంచింత గ్రామానికి రూ.8 కోట్ల వ్యయంతో 6 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణం చేపడుతున్నాం.

పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులును గెలిపించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డి.వి.రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మండలంలోని విఆర్.పురం బీసీ కాలనీలో డి.వి.రాఘవులు గెలుపును కాంక్షిస్తూ ప్రజా సంఘాల నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓట్లు ఉన్న ఇళ్లకు, షాపులకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, కార్మికుల, పేద ప్రజల సమస్యలపై నిరంతరం శాసన మండలిలో గళం విప్పి, ప్రజల గొంతుకను వినిపించేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని పేర్కొన్నారు. అలాంటి వారిని కచ్చితంగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యతక ఎంతో ఉందన్నారు. ప్రతి ఒక్క పట్టభద్రు ఓటరు తమ మొదటి ప్రాధాన్యత ఓటును డి.వి.రాఘవులుకు వేసి అత్యంత మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కమ్మచిచ్చు సత్యనారాయణ, ప్రగిల్లా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్లను కలిసి ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సమస్యలపై పోరాడేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలే : లోతా రామారావు

రాజవొమ్మంగి : కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని, ఈ నెల 27న జరుగు ఎమ్మెల్సీ ఎన్నికలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చట్టసభలలో ఉపాధ్యాయుల సమస్యలపైనా, పాఠశాలల బలోపేతానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే కృషి చేస్తున్నారని తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డివి.రాఘవులు గురుకుల పాఠశాల, కళాశాలల్లో పని చేస్తున్న కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. దిడ్ల వీరరాఘవులను ఎమ్మెల్సీగా గెలిపించి చట్టసభలకు పంపిస్తే ఈ వర్గాల సమస్యలను శాసనమండలిలో లేవనెత్తి పరిష్కరించే విధంగా కృషి చేస్తారని పేర్కొన్నారు.

ఉచిత పథకాలపై ఇంత నిర్లక్ష్యమా!

- లబ్ధిదారుల ఇంటికైనా చేరని మిరియాల నూర్పిడి మిషన్లు
- కిలోమీటర్లు దూరంలో నిర్లక్ష్యంగా వదిలేసిన వైనం
- వినియోగంలోకి రాకుండానే పాడైన యంత్రసామగ్రి
- అధికారుల నిర్వాకంపై వెల్లువెత్తుతున్న విమర్శలు

ఏళ్ల తరబడి ఆరుబయట వదిలేసిన మిరియాల మిషన్లు

ప్రజాశక్తి- అనంతగిరి : ఆదివాసీ గిరిజనుల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచిత, రాయితీ పథకాలు అవగాహనాలేమితో నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రభుత్వపరంగా పథకాలను అందజేస్తున్న అధికారయంత్రాంగం, వాటి నిర్వహణ, సద్వినియోగంపై తమకేమీ పట్టనట్లు కనీసం దృష్టి పెట్టకపోవడంతో ప్రభుత్వ ఆశయానికి విఘాతం కలుగుతుండగా, ప్రజాధనం దుర్వినియోగమే తప్ప, లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరని పరిస్థితి నెలకొంటోంది. అనంతగిరి మండలంలోని డెక్కపురం పివిటిజి గిరిజనులకు ఉచితంగా అందించిన మిరియాల నూర్పిడి యంత్రాలే నిదర్శనం. మండలంలోని అనంతగిరి పంచాయతీ డెక్కపురం ఆదివాసీ గిరిజనులకు 2020-21లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో మిరియాల నూర్పిడి యంత్రాలను ఉచితంగా అందజేశారు. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన కాఫీ, మిరియాలకు అల్లూరి జిల్లాలోని పాడేరు మన్యం ప్రసిద్ధి కావడంతో ఇక్కడి రైతులకు ప్రయోజనకరంగా ఉండేందుకు ఒక్కొక్కటీ రూ.నాలుగు లక్షల విలువచేసే మిరియాల నూర్పిడి యంత్రాలను ఉచితంగానే అందజేశారు. పాడేరు ఐటిడిఎ ఆధ్వర్యంలో కాఫీబోర్డు, హార్టీకల్చర్ విభాగాలు సంయుక్తంగా వీటిని అందజేశారు. అయితే డెక్కపురం గ్రామానికి ఈ మిషన్లు తీసుకెళ్లాలంటే సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామానిక పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజుపాక వద్దే వీటిని వదిలేశారు. కొన్నేళ్లుగా ఎటువంటి రక్షణ, భద్రత లేకుండా రాజుపాక వద్ద వాటిని ఆరుబయటే అలాగే వదిలేయడంతో ఎండావానకు తడుస్తూ, యంత్రాలన్నీ నిరుపయోగంగా మారింది. అంతేకాక వాడకం లేకపోవడంతో అనేక యంత్ర భాగాలు పాడైపోయాయి. మిరియాలు పండించే గిరిజన రైతులకు ఈ మిషన్లు ఎంతో ఉపయోగకరమైనా, వాటిని నిర్వహణ, సక్రమ సద్వినియోగంపై అవగాహన లేకపోవడంతో లక్షలు విలువైనప్పటికీ, ఇవి నిర్లక్ష్యంగా నిరుపయోగంగా వదిలేశారు. ప్రభుత్వపరంగా ఉచితంగాఅందజేసిన అధికారులు, ఆ తర్వాత ఇవి ఏమేరకు వినియోగపడ్డాయే కనీసం పర్యవేక్షణ లేకపోవడంతో పట్టించుకునే దిక్కులేకుండా పోయింది. రూ.లక్షలు విలువచేసే మిరియాల యంత్రసామగ్రి పాడవ్వడానికి గిరిజనరైతుల అవగాహన లేకపోవడం ఒక కారణమైతే, పథకాలను సక్రమంగా అమలు చేయాల్సిన అధికారుల బాధ్యతారాహిత్యం కూడా ప్రధాన కారణమని చెప్పక తప్పదు. గడిచిన ఐదారేళ్లలో కనీసం ఒక్కసారైనా, ఏ ఒక్క అధికారి అయినా, ప్రభుత్వపరంగా ఉచితంగా ఇచ్చిన ఈ యంత్రాలు ఏ మేరకు సద్వినియోగపడ్డాయో కనీసం వెళ్లి పరిశీలించకపోవడం దారుణమని పలువురు అంటున్నారు. దీంతో ప్రభుత్వాలు పథకాలను అమలు చేస్తున్నా, వాటి ద్వారా లబ్ధిదారులకు ఇసుమంతైనా ప్రయోజనం దక్కని పరిస్థితి ఉంది. డెక్కపురంలో మిరియాల యంత్రాలు ఇలా నిరుపయోగంగా మారగా, మరెన్నో ఉచిత, రాయితీ పథకాలు అమ్ముడుపోవడం, చేతులు మారడం సర్వసాధారణంగా మారిపోయినా అధికారులు తమకేమీ పట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పథకాల సద్వినియోగంపై అధికారులు దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


వినియోగంలో లేకపోవడంతో తుప్పు పట్టిన యంత్రాలు

నేరాలు ఘోరాలు

దగ్ధమైన తోటలను పరిశీలిస్తున్న స్థానికులు

విద్యుత్తు తీగలు తెగిపడి తోటలు దగ్ధం

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలోని సొవ్వా పంచాయతీ కమలబంద గ్రామ సమీపంలో శనివారం రాత్రి విద్యుత్తు తీగలు తెగిపడ్డాయి. ఆకస్మిక తోటలు దగ్ధమవ్వడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. రాత్రిపూట జరగడంతో పశువులు కాపాడారు, పశువులకు ప్రమాదం తప్పిందని గిరిజనులు అంటున్నారు. తెగిపడిన తీగలతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. సంబంధిత విద్యుత్తు శాఖ అధికారులకు గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు గురునాయుడు సమాచారం అందించారు. సిబ్బంది చేరుకుని స్థానికుల సాయంతో తీగలను సరి చేసి విద్యుత్తును పునరుద్ధరించారు.

చిరు వ్యాపారి ఆత్మహత్య

ప్రజాశక్తి -భీమునిపట్నం : అప్పుల బాధ తాళలేక జివిఎంసి నాలుగో వార్డు పరిధి కాపులుప్పాడ జగనన్న కాలనీలో నివసిస్తున్న చిరు వ్యాపారి కె.గోవిందరావు (55) శనివారం రాత్రి చెట్టుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వీధుల్లో ప్లాస్టిక్, ఇనుప సామాగ్రి వస్తువుల కొనుగోలుతో పాటు ఐస్ క్రీమ్ అమ్ముతూ వచ్చే అరకొర ఆదాయంతో జీవించే వాడు. అధికంగా అప్పుల పాలయ్యాడు. ఈ క్రమంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- గాజువాక : అక్కిరెడ్డిపాలెంలో నివసిస్తున్న కర్రి ప్రవీణ్ (27) విశాఖ డెయిరీ సర్వీస్ రోడ్డులో ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. కుటుంబ కలహాల కారణంగా చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడు కర్రి ప్రవీణ్ ఫ్లూట్ షాప్‌లో పనిచేస్తున్నాడు. మరిన్ని వివరాల కోసం గాజువాక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సురక్షిత ఇంటర్నెట్ ప్రవర్తనపై గీతంలో వర్క్‌షాప్

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్, సోషల్ సైన్స్ ఆధ్వర్యాన "సురక్షిత ఇంటర్నెట్ ప్రవర్తన" అనే అంశంపై ప్రమోషన్ ఆఫ్ అకడమిక్, రీసర్చ్ కొలాబరేషన్ (స్పార్క్) వర్క్‌షాప్ నిర్వహించారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ సహకారంతో స్పార్క్ పథకంలోని ఐఐటి ఖరగ్‌పూర్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆన్‌లైన్ భద్రత, డిజిటల్ నైతికత, బాధ్యతాయుతమైన ఇంటర్నెట్ వినియోగం గురించి విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు రెండురోజుల పాటు అవగాహన కల్పించారు. ఆదివారంతో ముగిసిన కార్యక్రమంలో గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా మాట్లాడుతూ, గ్లోబల్ కనెక్టివిటీ పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితిలో డిజిటల్ భద్రత ఎంత ముఖ్యమైందో వివరించారు. సురక్షితంగా ఇంటర్నెట్‌ను వాడే అవగాహన, నైపుణ్యాలను అందజేయడంలో వర్క్‌షాప్ కీలక పాత్ర పోషిస్తుందని, సాంకేతికతను సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవడానికి సహాయపడుతుందని తెలిపారు. ఐఐటి ఖరగ్‌పూర్ స్పార్క్ ప్రాజెక్టు జాతీయ సంయుక్త కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ రబీబ్రత ముఖర్జీ మాట్లాడుతూ, సైబర్ భద్రతా విద్య, సురక్షిత ఇంటర్నెట్ ప్రవర్తనను ప్రోత్సహించడం ద్వారా వ్యక్తులు, సంస్థలను డిజిటల్ ముప్పు నుండి రక్షించవచ్చని పేర్కొన్నారు.

మండల పరిషత్‌లో ఏర్పాటు చేసిన బేబీ ఫీడింగ్‌రూం

బేబీ ఫీడింగ్ గదుల ఏర్పాటు

ప్రజాశక్తి -అనంతగిరి : బిడ్డలకు పాలిచ్చే తల్లుల సౌకర్యార్థం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయంలో బేబీ ఫీడింగ్ గదులను ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ ఎవివి.కుమార్ తెలిపారు మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయాలతోపాటు, అనంతగిరి, లుగపర్తి, భీమవరం., పినకోట పిహెచ్‌సిలు, స్థానిక సచివాలయాల్లో బేబీ ఫీడింగ్‌కు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశామని తెలిపారు ఈ అవకాశాన్ని పాలిచ్చే తల్లులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో సిడిపిఒ సంతోషికుమారి, సూపర్వైజర్ పాల్గొన్నారు

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని అండిబ పంచాయతీ కేంద్రంలో మత్స్యదేవత జాతర సందర్భంగా నిర్వహిస్తున్న మెగా వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం స్థానిక సర్పంచ్ తామర్ల సత్యనారాయణ, మండల వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తామర్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 24,25 తేదీల్లో మెగా టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, వాలీబాల్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొవాలని పిలుపునిచ్చారు.పోటీల్లో పాల్గొనే జట్లు ప్రవేశరుసుముగా రూ. 600 చెల్లించాలన్నారు టోర్నీలో విజేత జట్టుకు రూ.20 వేలు, రన్నరప్‌కు రూ.పదివేలు, మూడోస్థానంలో నిలిచిన జట్టుకురూ.ఐదు వేలు నగదు బహుమతి అందజేస్తామన్నారు. . క్రీడాకారులకు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. పోటీలు ముగింపు రోజు ఈనెల 25న శివరాత్రి ఉత్సవాల జాతర వేదికపైనే బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వాలీబాల్ జట్లు వివరాలకు సివేరి ఈశ్వరరావు 89857 62780, రవీంద్రపడాల్ 85007 98970లను సంప్రదించాలని సూచించారు. ప్రారంభ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాడి రాజారావు, పీసా కమిటీఉపాధ్యక్షుడు పాడి నరసింహ మూర్తి, తెలుగు యువత నేత సివేరి ఈశ్వరరావు, సంసాడ అప్పన్న, పాడి కర్రన్న, బొడ్డ శివ, పి.పెంటన్న, సివేరి సత్యనారాయణ, మేనేజ్‌మెంట్ కమిటీ పాడి శివప్రసాద్, చిట్టపులి రవీంద్ర పడాల్, గెమ్మలి కొండబాబు, బొడ్డ సన్యాసిరావు, సత్యనారాయణ, చిట్టి పడాల్, దూసూరు అప్పలకొండ, సూరిబాబు, సురేష్ పాల్గొన్నారు.

టోర్నీ ప్రారంభోత్సవంలో వైస్ ఎంపిపి, సర్పంచ్

వాగులోకి దిగి స్నానాలు చేస్తున్న పర్యాటకులు

ప్రమాదాలకు నిలయంగా పర్యాటక ప్రాంతాలు

- రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని పర్యాటక ప్రదేశాలు ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయి. ప్రతి ఏటా ఈ ప్రదేశాలలో పదుల సంఖ్యలో పర్యాటకుల ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా ఈ ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రంపచోడవరం నియోజకవర్గంలోని పలు వాగులలో ప్రమాదాలకు గురై తరచూ పలువురు ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. రంపచోడవరం మండలం ఐ.పోలవరం సమీపంలోని పార్క్ వద్ద వాగులో దిగేందుకు మెట్లను ఏర్పాటు చేశారు. దీంతో అక్కడికి వచ్చే పర్యాటకులు ప్రమాదంగా ప్రవహిస్తున్న వాగులో దిగి స్నానాలు చేస్తున్నారు. దీనికి సమీపంలోనే ముసురుమిల్లి జలాశయం బ్యాక్ వాటర్ ఉండడంతో ఆ ప్రదేశంలో బాగా లోతుగా ఉంటుంది. పర్యాటకులు ప్రమాదవశాత్తు వాగులో పడి కొట్టుకుపోతే ప్రాణాలను కోల్పోయే ప్రమాదం ఉందని, కనుక ఆ ప్రదేశంలో రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. గతంలో పోలవరం సమీపంలో ప్రమాదవశాత్తు వాగులో పడి చాలామంది పర్యాటకులు ప్రాణాలు పోయిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్యాటక ప్రాంతాలలో రక్షణ ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రజల విశ్వాసం కోల్పోతున్న కూటమి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోందని వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. రీజనల్ కో-ఆర్డినేటర్‌గా నియమించబడిన అనంతరం మొదటిసారి విశాఖపట్నం జిల్లా కార్యాలయానికి విచ్చేసిన కన్నబాబుకు పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ ఘన స్వాగతం పలికారు. అనంతరం కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాలను చంద్రబాబు మోసం చేశారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చంద్రన్న పగ, చంద్రన్న దగా అనే పథకాలు అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఉద్యమాలకు పురిటిగడ్డ అయిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, తమ ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం విశాఖను పరిపాలనా రాజధానిగా చేయాలని చూశామని అన్నారు. గ్రూప్ 2 అభ్యర్థులను ప్రభుత్వం నిట్టనిలువునా మోసం చేసిందని, వేల కోట్లు అప్పు చేసి చంద్రబాబు ఏం చేశారో తెలియడంలేదని అన్నారు. పలువురు నాయకులు తమ పార్టీపై విష ప్రచారం చేస్తున్నారని, జగన్ కోసం ప్రాణాలు ఇచ్చేవారు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నారని గుర్తెరగాలని ఆయన అన్నారు.

ప్రతిభగల విద్యార్థులకు ఉపకారవేతనాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అమెరికన్ ప్రొగ్రసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) అధ్వర్యంలో విశాఖపట్నంలోని ఆళ్వారుదాసు విద్యాసంస్థ ఐఐఎం కళాశాల వేదికగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ప్రతి ఏటా ఇచ్చే అమెరికన్ స్టూడెంట్స్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం - 2025 కార్యక్రమం ఆదివారం ఉదయం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అల్లియన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 105 గవర్నర్ దండెం పోలారావు మాట్లాడుతూ పేదరికం వల్ల ఎవరి చదువూ ఆగిపోరాదనే సదుద్దేశంతో అమెరికన్ ప్రొగ్రసివ్ తెలుగు అసోసియేషన్ నిధులు సమకూర్చి పేద విద్యార్థులకు అందిస్తోందన్నారు. ఈ మహత్కార్యాన్ని నిర్వహించడం అత్యంత ఆనందదాయకమన్నారు. స్కాలర్‌షిప్పులు అనేవి విద్యార్థుల బాధ్యతను మరింత పెంచుతాయని, ఈ స్కాలర్‌షిప్పుల ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన అన్నారు. మరో అతిథి రమేష్ మాట్లాడుతూ ఇప్పుడు ఇచ్చే ఈ స్కాలర్ షిప్‌ల వెనుక అమెరికాలో రోజూ 18-20 గంటల పనిచేస్తున్న ఎంతో మంది శ్రమ ఉందని అన్నారు.

ఫలించిన పోరాటాలు

గిరిజన పల్లెలకు తాగునీరు, రహదారులు, విద్యుత్
ఏళ్ల తరబడిలేని కనీస సౌకర్యాలు దక్కడంతో అందరిలో ఆనందం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని నాన్ షెడ్యూల్ మండలాల్లో సిపిఎం, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ పోరాటాలతో గిరిజన గ్రామాలకు కనీస సౌకర్యాలు లభిస్తున్నాయి. కరెంటు వెలుగు తెలీని గ్రామాలకు విద్యుత్ సదుపాయం వచ్చింది. రహదారులు మంజూరు కావడంతో డోలీ మోతల బాధ తప్పనుంది. గెడ్డనీరు తాగే గిరిజనులకు సురక్షిత నీరు అందుబాటులోకి వచ్చింది. గిరిజన గ్రామాలకు లభించే ప్రతి సౌకర్యం వెనుక సుదీర్ఘ పోరాటం వుంది. సిపిఎం, నాన్ షెడ్యూల్ గిరిజన సంఘం కృషి వుంది. పట్టువిడవకుండా గిరిజనుల సమస్యలపై నిర్వహించిన నిరంతర పోరాటాల ద్వారా సాధించిన విజయాలతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ కాలినడకన గిరిజన గ్రామాలను సందర్శించారు. గిరిజన సమస్యలను అర్థం చేసుకొని రహదారులకు నిధులు మంజూరు చేశారు. విద్యుత్ సౌకర్యం కల్పించారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని చేసిన పోరాటంతో రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీలోని పివిటిజి గ్రామాలు పిత్రిగడ్డ, పెద్దగరువుకు 15వ ఆర్థిక సంఘం నిధులతో ఇంటింటికీ కుళాయి సౌకర్యం కలిగింది. రేషన్ కార్డులు లేని కొత్తగా పెళ్లయిన తొమ్మిది కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరయ్యాయి. పిత్రిగడ్డ. నీళ్లబందలో 18 మంది పిల్లలకు ప్రత్యామ్నాయ పాఠశాలను పిత్రిగడ్డలో ఏర్పాటు చేశారు.

పెద్దగరువు, పాత లోసింగి, కొత్త లోసింగికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని, ఆశా కార్యకర్తను నియమించాలని చేసిన పోరాటం ఫలించింది. గతేడాది జూన్‌లో లోసింగిలో ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటు చేశారు. 40 మంది జనాభా కలిగిన పిత్రిగడ్డకు ఆర్ల నుండి బిటి రోడ్డుకు రూ.4.50 కోట్లు, 30 మంది జనాభా కలిగిన పెదగరువుకు వైబి.పట్నం నుంచి బిటి రోడ్డుకు రూ.2.50 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. నీళ్లబంద, పశువులు బంద, సోంపురం బంద, జిలుగులోవకు కరెంటు సౌకర్యం కలిగింది. తాజాగా రావికమతం మండలం చీమలపాడు పంచాయతీలోని జెడ్.జోగింపేట నుంచి 12 కుటుంబాలున్న గిరిజన గ్రామం నేరేళ్లబంద వరకు రూ.2.5 కోట్లతో బిటి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సౌకర్యాల కల్పన వెనుక సిపిఎం, గిరిజనుల ఆరేళ్ల పోరాటం వుంది. గతేడాది డిసెంబరులో అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలంలో దాదాపు రూ.11.60 కోట్ల విలువైన రెండు రహదారి పనులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. అటవీ అనుమతుల్లేక ఆ రహదారి పనులు ప్రారంభించలేదు. సిపిఎం పోరాటంతో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. వారం రోజుల్లో నేరేళ్ల బంద రహదారి పనులకు నిధులు మంజూరు, అటవీ అనుమతులు పొంది పనులు ప్రారంభించారు.

ప్రారంభమైన నేరేడు బంద రోడ్డు పనులు

సౌకర్యాల సాధన వెనుక ఆరేళ్ల పోరాటం

నాన్ షెడ్యూల్ గిరిజనుల సమస్యలను 2015లో గుర్తించాం. కాలినడకన పాతలోసింగి, పెదగరువు, పిత్రిగడ్డ, కొత్త లోసింగి వెళ్లి పెద్దగరువులో ఆ రాత్రి వున్నాం. గిరిజనులు పడుతున్న ప్రతి సమస్యనూ క్షుణ్ణంగా తెలుసుకున్నాం. వాటిని ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లాం. వినతులు, విజ్ఞాపనలతో మొదలై పోరుబాట పట్టాం. వివిధ రూపాల్లో, వివిధ స్థాయిల్లో ఆరేళ్లుగా పోరాటాలు చేపట్టాం. ఆ కృషి ఫలితంగా నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలకు 76 ఏళ్ల నుంచి లేని తాగునీరు, రోడ్లు, ప్రత్యామ్నాయ పాఠశాలలు, విద్యుత్ సౌకర్యాలు లభించాయి. జనన ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు పొందారు.

- కె.గోవిందరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు

జగన్, పెద్దిరెడ్డి దోపిడీపై అసెంబ్లీలో చర్చించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, ఆయన మంత్రివర్గంలో పనిచేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిల దోపిడీ వ్యవహారాలపై అసెంబ్లీ సమావేశాలలో చర్చించాలని విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి వస్తారని ప్రకటన చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై జగన్ మాట్లాడాలన్నారు. ప్రతిపక్ష నాయకుని హోదా కోసం జగన్ అసెంబ్లీకి వెళ్తే ప్రజలు హర్షించరన్నారు. గత ఐదు సంవత్సరాలలో ప్రకృతి వనరులను నాశనం చేసినందుకు జగన్, వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం చేయని పనులను కూటమి ప్రభుత్వం చేస్తోందని తెలిపారు.

గడిచిన ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న పేరు ప్రతిష్టలు చూసి వైసిపి నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవాలని ప్రత్యేక వ్యూహంతో జగన్ ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోందని ఆరోపించారు.

విశాఖలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద బారులుతీరిన గ్రూప్ - 2 అభ్యర్థులు

పటిష్ట బందోబస్తు నడుమ గ్రూప్-2 పరీక్ష

- సమస్యాత్మక కేంద్రాల్లో డ్రోన్లతో నిఘా
- తొలి పేపర్‌కు 9,391, రెండో పేపర్‌కు 9,370 మంది హాజరు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్/ఎంవిపి.కాలనీ

ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో ఆదివారం విశాఖ జిల్లాలో నిర్వహించిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష పటిష్ట బందోబస్తు నడుమ ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోలేదు. పరీక్షకు మూడు రోజుల ముందు జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగం తగు జాగ్రత్తలు తీసుకుంది. జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. నిర్దేశిత సమయానికి అభ్యర్థులంతా కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 6.30 గంటలకే లైజన్ అధికారులు సంబంధిత మెటీరియల్‌తో కేంద్రాలకు వచ్చారు. ఎపిపిఎస్‌సి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని రకాల ముందస్తు చర్యలూ చేపట్టారు. నిబంధనలు పాటిస్తూ పరీక్షా పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి పోలీసు భద్రత నడుమ పరీక్షా కేంద్రాలకు తరలించారు. గ్రూప్-2 ప్రధాన పరీక్షను సజావుగా, విజయవంతంగా నిర్వహించేలా జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తగిన చర్యలు తీసుకున్నారు. ఒక రోజు ముందుగానే జాయింట్ కలెక్టర్ అన్ని కేంద్రాల తాలూకా పరిస్థితులను తెలుసుకొని జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. శనివారం రాత్రి జరిగిన ఆందోళనల నేపథ్యంలో సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద డ్రోన్లతో నిఘా పెట్టారు. జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమే కాకుండా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అన్ని పరీక్షా కేంద్రాలను కెమెరాలతో అనుసంధానం చేస్తూ డ్యాష్ బోర్డుతో కూడిన కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా పరిస్థితిని సమీక్షించిన జిల్లా రెవెన్యూ అధికారి బి.హెచ్.భవానీ శంకర్ ఎప్పటికప్పుడు కలెక్టర్‌కు నివేదించారు.

ఉదయం వచ్చిన వారిలో 21 మంది మధ్యాహ్నం గైర్హాజరు

గ్రూప్-2 ప్రధాన పరీక్షకు జిల్లాలో మొత్తం 11,030 మంది దరఖాస్తు చేసుకోగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు జరిగిన తొలి పేపర్‌కు 9,391 (85.14 శాతం) మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు జరిగిన రెండో పేపర్‌కు 9,370 (84.95 శాతం) మంది హాజరయ్యారు. ఉదయం వచ్చిన వారిలో 21 మంది అభ్యర్థులు మధ్యాహ్నం జరిగిన పరీక్షకు హాజరుకాలేదు. కొమ్మాది చైతన్య ఇంజినీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం ఒక అభ్యర్థి బిపి తగ్గడంతో అస్వస్థతకు గురయ్యారు. అధికారులు వెంటనే స్పందించి పోలీసు భద్రత నడుమ సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఎయు ఇంజినీరింగ్ కాలేజీ మెయిన్ బ్రాంచ్, న్యూ క్లాస్ రూమ్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను, అలాగే జైలు రోడ్డులోని డిగ్రీ మహిళా కళాశాల, సీతంపేట పరిధిలోని బివికె, ప్రిజమ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను సందర్శించి అక్కడ పరిస్థితిని పరిశీలించారు.

బర్డ్ ఫ్లూపై అవగాహన

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం జర్రెల పంచాయితీలో ఆదివారం బర్డ్ ఫ్లూపై జనసేన మండల ప్రధాన కార్యదర్శి పుత్తూరు విష్ణుమూర్తి, పీసా కమిటీ ఉపాధ్యక్షులు చిక్కుడు అశోక్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ వ్యాధినే ఏవియన్ ఇన్ఫ్లుఎంజా వైరస్ అని కూడా పిలుస్తారని పేర్కొన్నారు. ఈ వైరస్ ఇటీవల మానవులకు కూడా సోకిందన్నారు. పెంపుడు జంతువులు, పక్షజాతులు చనిపోయిన వాటి మాంసం తినకుండా నిరోధానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.